క్లుప్తంగా

ఫిట్ ఇండియా క్విజ్ పోటీలు

సిరిసిల్లకల్చరల్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యువజన సర్వీసుల శాఖ సారథ్యంలో ఫిట్ ఇండియా క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి అజ్మీర రాందాస్ తెలిపారు. 2019లో ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ వివరాలను ఈనెల 31 లోపు నమోదు చేసుకోవాలన్నారు. సుమారు రూ.3కోట్ల విలువైన బహుమతులు గెల్చుకునే అవకాశముందన్నారు. నీట్, ఐఐటీ వంటి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పోటీ పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ పోటీలను నిర్వహించనుందన్నారు. ఇంగ్లిష్, హిందీతో పాటు 11 ప్రాంతీయ భాషల్లో క్విజ్ పోటీలుంటాయి. *http:// fitindia. nta. ac. in/ i/ register/* లింక్ ద్వారా ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని పాఠశాలల నిర్వాహకులను కోరారు.

కోరం లేక సభ వాయిదా

గంభీరావుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వంగ కరుణ అధ్యక్షతన నిర్వహించతలపెట్టిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి శనివారం సభ్యులెవరూ హాజరు కాలేదు. దీంతో సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. పండుగల నేపథ్యంలో సభ్యులు హాజరు కానట్లు భావిస్తున్నారు.

సీఎమ్మార్‌ఎఫ్ చెక్కు అందజేత



ఎల్లారెడ్డిపేట: మండలంలోని బాకూర్‌పల్లితండాకు చెందిన మహిళ స్వర్ణలతకు మంజూరైన సీఎమ్మార్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం అందించారు. ఆగయ్య మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేయలేదని, తెలంగాణ ఏర్పడ్డాక అనేకమందికి సహాయం అందుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి కారు గుర్తుపై ఓటు వేసి హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. రాజు అజ్మీరానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అందె సుభాష్, మోహన్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లిలో శనివారం వాటర్ ప్లాంట్‌ను ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాగట్లపల్లి గ్రామస్తుల కోసం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొంత ఖర్చులతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దాసరి సుజాత, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు మందాటి రాము, సీనియర్ నాయకులు మందాటి మల్లేశ్, మందాటి సతీశ్, మందాటి లక్ష్మణ్, మానుక సురేశ్, నాగం మల్లేశ్, నెత్తట్ల శ్రీనివాస్, మానుక మహేశ్, మంద నాగరాజు, నాగరాజు పాల్గొన్నారు.

రెవెన్యూ అటెండర్‌కు గాయాలు

ముస్తాబాద్: ముస్తాబాద్ రెవెన్యూ కార్యాలయంలో పని చేసే అటెండర్ స్వామి మూర్ఛ వ్యాధితో శనివారం సొమ్మసిల్లిపోయాడు. విధి నిర్వహణలో భాగంగా ముస్తాబాద్‌లోని ఓ దుకాణం వద్దకు వచ్చిన స్వామి.. ఒక్కసారిగా కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆసుపత్రికి తరలించారు. కిందపడ్డ స్వామికి గాయాలయ్యాయి. ఏడాదిగా మూర్ఛ సంబంధిత వ్యాధితో స్వామి బాధపడుతున్నాడని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. చికిత్స అనంతరం స్వామిని డిశ్చార్జి చేశారు.

కార్యవర్గం ఎన్నిక

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల భవన నిర్మాణ కార్మికులు సమావేశం నిర్వహించుకున్నారు. ముఖ్య అతిథిగా వీర్నపల్లి ఎంపీటీసీ మల్లారపు అరుణ్ కుమార్ హాజరయ్యారు. మండల భవన నిర్మాణ సంఘాన్ని సీఐటీయూ అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మల్లారపు దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా కట్కూరి రాజు, ఉపాధ్యక్షుడిగా రాజెల్లయ్య, కోశాధికారిగా నర్మెట శంకర్, సలహాదారులుగా గంజయ్య, చంద్రయ్య, రాజం, పెద్దరాజం తదితర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల మాజీ అధ్యక్షుడు రాజం పాల్గొన్నారు.

24న విజయదశమి వేడుకలు

సిరిసిల్లఅర్బన్: ఈనెల 24న విజయదశమి వేడుకలను నిర్వహించనున్నట్లు హిందూ ఉత్సవ సమితి సభ్యులు పేర్కొన్నారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంగళవారం శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారు అశ్వవాహనంపై ఊరేగింపుగా వచ్చి శమీ దర్శనం చేసుకోవడం జరుగుతుందన్నారు. రామ్‌లీలా మైదానంలో రావణ దహన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్, ఆడెపు రవీందర్, మేర్గు సత్యనారాయణ, గాజుల వేణు, వెంకన్నగౌడ్, సదానందం, శ్రీను, మల్లేశం తదితరులున్నారు.

డీజేల హోరులో.. అతివల జోష్..!

- తొమ్మిది రోజులు ఎంజాయ్
- నేడే పూల పండుగ.. సద్దుల బతుకమ్మ
- నోరూరించే సత్తు పిండ్లు
- మహిళలకు ప్రీతిపాత్రమైన పర్వదినం



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బోయినపల్లి(చొప్పదండి): డీజే.. డీజే.. బతుకమ్మ సంబరాల్లో సాయంత్రం అయ్యిందంటే చాలు.. ప్రతీ వీధిలో డీజే సాంగ్స్ హోరెత్తుతాయి. వారం రోజుల పాటు మహిళలు, యువతులు డీజేల హోరులో నయా జోష్‌తో బతుకమ్మ ఆటలు.. కోలాటాలతో ఎంజాయ్ చేస్తారు. మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన సద్దుల బతుకమ్మ పర్వదినం ఘనంగా నిర్వహించుకునేందుకు పల్లెలు ముస్తాబవుతున్నాయి. ఆదివారం సద్దుల బతుకమ్మ పర్వదినం అంగరంగ వైభవంగా నిర్వహించుకునేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. ఎంగిలి పూల బతుకమ్మ అనంతరం ప్రతీ రోజు బతుకమ్మలు పేర్చి ఆడి మహిళలు మురిసిపోయారు. చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. గ్రామంలో ఉన్న మహిళలందరూ ఒకచోట చేరి బతుకమ్మ ఆడుతారు. అనంతరం వాగుల్లో నిమజ్జనం చేస్తారు. ఈసారి కొందరు శుక్రవారం సద్దుల బతుకమ్మ పండుగ చేసుకోగా, మెజార్టీగా ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోనున్నారు.

పూల పండుగ..

బతుకునిచ్చే బతుకమ్మను తీరొక్క పూలతో పేరుస్తారు. గునుగు, తంగెడు, పట్టుకుచ్చు, బంతి, చామంతి తదితర పూలతో పేరుస్తారు. మధ్యలో గుమ్మడి పువ్వు గౌరమ్మను ఉంచుతారు. గౌరమ్మ దేవతను ఘనంగా పూజిస్తారు. మహిళలు బతుకమ్మలు నిమజ్జనం చేశాక పసుపు, కుంకుమలు వాయినాలు ఇచ్చుకుంటారు.

నోరూరించే సత్తు పిండ్లు

బతుకమ్మ పర్వదినం సందర్భంగా సత్తు పిండ్లు తయారు చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. పెసర, నువ్వులు, మక్క, పల్లి తదితర సత్తు పిండ్లు తయారు చేస్తారు. చిన్నారులు సత్తు పండ్లను ఇష్టంగా ఆరగిస్తారు.

డ్రెస్ కోడ్..

గతంలో బతుకమ్మ పర్వదినం రోజుల్లో మహిళలు ఒకచోట చేరి పాటలు పాడేవారు. ఇపుడు డీజేలు వచ్చాక ప్రతీ వాడలో ఓ రెండు డీజే బాక్స్‌లు పెట్టుకొని డ్రెస్ కోడ్‌తో అంటే మహిళలంతా ఒకేరకమైన చీరెలు ధరించి డీజేల సాంగ్స్ హోరులో బతుకమ్మ ఆటలు ఆడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా ప్రతీ వాడలో అర్ధరాత్రి వరకు ఎంజాయ్ చేస్తారు.



డ్రెస్ కోడ్‌తో బతుకమ్మ సంబరాల్లో మహిళలు

అందరం ఒకచోట కలుస్తాం



బతుకమ్మ పండుగ వచ్చిందంటే మహిళలందరం ఒకచోట కలుస్తాం. అందరం కలిసి బతుకమ్మ ఆడడం ఎంతో సంతోషంగా ఉంటుంది. ఒకరికి ఒకరం బతుకమ్మ వాయినం ఇచ్చి పుచ్చుకుంటాం. మహిళలు, చిన్నాపెద్దా తేడా లేకుండా ఆడుకునే బతుకమ్మ పండుగ అంటే నాకు ఎంతో ఇష్టం.

– కొప్పుల లక్ష్మి, సర్పంచ్, గుండన్నపల్లి

తెలంగాణలో పెద్ద పండుగ



తెలంగాణలో అతి పెద్ద పండుగ బతుకమ్మ. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక బతుకమ్మ పండుగకు ప్రభుత్వం మంచి గుర్తింపు తెచ్చింది. అందమైన పూలతో అందంగా బతుకమ్మలు పేర్చి ఆడడం అందరికీ ఎంతో ఇష్టం. మహిళల పూల పండుగ బతుకమ్మ.

– రంగి రేణుక, సర్పంచ్, రత్నంపేట

డీజేతో జోష్



బతుకమ్మ సంబరాల్లో ఇపుడు డీజే సౌండ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లో డీజే సౌండ్స్ లేనిది బతుకమ్మ సంబరాలకు జోష్ రావడం లేదు. రెండు, మూడు సంవత్సరాలుగా డీజే సౌండ్స్‌తో బతుకమ్మ సంబరాలు ప్రతీ వాడలో నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజులు బతుకమ్మ ఆటలు సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఆడిన సందర్భాలున్నాయి. – అరుణిక, ఉపాధ్యాయురాలు, సిరిసిల్ల

ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు

- రోడ్ల మీదే దళారుల దోపిడీ
- దగా పడుతున్న రైతన్నలు



ఫాజుల్‌నగర్ వద్ద రోడ్డుపై కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారి

వేములవాడరూరల్: వర్షాకాలం పంట రైతన్న చేతికి చేరుకున్నా.. ప్రభుత్వం ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో తప్పని పరిస్థితుల్లో రైతన్న ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించక తప్పడం లేదు. వేములవాడ మండలంలో నీటి సౌకర్యం ఉండడంతో.. వరి, పత్తి, ఇతర పంటలు సాగు చేస్తారు. ఇందులో ప్రధానంగా వరి పంటను సాగు చేసుకుంటున్న రైతన్నకు స్థలాల కొరత ఉండడంతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను ఇంకా ప్రారంభించకపోవడంతో ఫాజుల్‌నగర్, వట్టెంల ప్రాంతాల్లో ఇప్పటికే రైతులకు ధాన్యం చేతికి చేరింది. ఆ ప్రాంతంలో ఉన్న కొంతమంది ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు. రోడ్లే మీదే బహిరంగంగా ప్రైవేట్ వ్యాపారులు కాంటాలు పెట్టి కొనుగోళ్లు ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే క్వింటాల్‌కు దాదాపు రూ.400 తక్కువకు రైతుల నుంచి ధాన్యాన్ని తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

అదనపు దోపిడీ

కష్టపడి పండించిన పంటను ప్రభుత్వ ధర కంటే ప్రైవేట్ వ్యాపారులు దాదాపు 450 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు గ్రేడ్–ఏ 2203 ఉండగా, కామన్ క్వింటాల్ ధరకు రూ.2183 ప్రస్తుతం ధర ఉంది. కానీ మధ్య దళారులు రైతుల నుంచి 1770కి కొనుగోలు చేసి నాణ్యత పేరుతో మరో వంద రూపాయలు కటింగ్ చేస్తున్నట్లు తెలిసింది. దాదాపు ఒక క్వింటాల్‌కు రూ.450కి పైగా రైతును దోచుకుంటున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. దళారులు కొనుగోలు చేస్తున్న కాంటాల్లో, తూకాల్లో కూడా మోసాలున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

హోమాలు.. ప్రత్యేక పూజలు



విలాసాగర్‌లో హోమం



మొర్రాయిపల్లెలో భక్తుల పూజలు



గంభీరావుపేట: అమ్మవారి సన్నిధిలో హోమం

బోయినపల్లి/ముస్తాబాద్/గంభీరావుపేట/కోనరావుపేట: బోయినపల్లి రామాలయంతో పాటు తడగొండ, బూర్గుపల్లి, విలాసాగర్ గ్రామాల్లోని దుర్గామాత మండపాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. విలాసాగర్‌లో చండీ హోమం నిర్వహించారు. ముస్తాబాద్ మండలం పోతుగల్, ఆవునూర్, గూడెం, మొర్రాయిపల్లె గ్రామాల్లో భక్తులకు అన్నదానం చేశారు. గంభీరావుపేట మండలంలో సామూహిక కుంకుమార్చనలు, చండీ హోమాలు జరిపారు. మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. కొలనూర్, మర్తనపేట, నాగారం, ధర్మారం, కనగర్తి, నిజామాబాద్, కోనరావుపేట, నిమ్మపల్లి గ్రామాల్లో పూజలు నిర్వహించారు. కనగర్తిలో హిందూ ఉత్సవ సమితి, రెడ్డి యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్‌కు ఆదరణ



వృద్ధున్ని ఓటు అభ్యర్థిస్తున్న మేడిపల్లి సత్యం

బోయినపల్లి(చొప్పదండి): కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం ఖాయమని చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. వస్తున్నా మీ సేవకై లో భాగంగా శనివారం రాత్రి దేశాయిపల్లి, జగ్గారావుపల్లి గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్ పల్లెపల్లెకు సత్యమన్న కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏనుగుల కనకయ్య, బండి శ్రీనివాస్, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, పులి లక్ష్మిపతి, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, బోయిని ఎల్లేశ్, నిమ్మ వినోద్‌రెడ్డి, పిట్టల మోహన్, భరత్‌రెడ్డి, నల్ల మోహన్, గుంటి జలేందర్, క్రాంతి కారణ్, నాగుల వంశీ, నక్క శ్రీకాంత్, కన్నం రాజు, ఆకుల అజయ్ తదితరులున్నారు.

రసమయి గెలుపును ఎవరూ ఆపలేరు



ఇల్లంతకుంటలో మాట్లాడుతున్న సిద్ధం వేణు

తంగళ్లపల్లి: మానకొండూరు నియోజకవర్గంలో మరోసారి రసమయి బాలకిషన్ ఎమ్మెల్యేగా జయకేతనం ఎగరేయడం ఖాయమని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మూడోసారి ఎమ్మెల్యేగా రసమయి హ్యాట్రిక్ సాధిస్తారని అన్నారు. సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, చెరుకుపెల్లి రాజిరెడ్డి, గూడెపుపల్లి సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ పర్శరాం, బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, నాయకులు సత్యనారాయణరెడ్డి, రమేష్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధికి గ్రహణం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి: బీఆర్‌ఎస్ పాలనలో మండల అభివృద్ధికి గ్రహణం పట్టిందని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక్క సంక్షేమ పథకం సైతం అమలు కాలేదని కాంగ్రెస్ మండల నాయకులు మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం, దళితబంధు పథకం, నిరుద్యోగ భృతి, రైతులకు రుణమాఫీ ఏ ఒక్క పథకం సైతం సక్రమంగా అమలు కాలేదన్నారు. మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ పిట్టల మోహన్, పులి లక్ష్మపతి, బోయిని ఎల్లేశ్, నల్ల మోహన్, సాన సత్యం, నిమ్మ వినోద్‌రెడ్డి, ముదాం శ్రీనివాస్, బాబు, నక్క శ్రీకాంత్, లక్ష్మారెడ్డి, పెండ్యాల శ్రీనివాస్, గుంటి జలేందర్, మొండయ్య, మహేందర్ పాల్గొన్నారు.

రుద్రంగిలో కాంగ్రెస్ ప్రచారం



రుద్రంగి: నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష ప్రత్యేక తెలంగాణ కోరికను నెరవేర్చి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను రానున్న ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపించాలని శనివారం మండల కేంద్రంలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తూము జలపతి, రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, నాయకులు పల్లి గంగాధర్, ఎర్రం గంగనర్సయ్య, దర్న మల్లేశం, గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు సద్దుల బతుకమ్మ పండుగ

వేములవాడఅర్బన్: రుద్రవరం, ఆరెపల్లి, సంకెపల్లి, నాంపల్లి, మారుపాక, చింతాల్‌ఠాణా, చంద్రగిరి, చీర్లవంచ గ్రామాల్లో ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా జరగనుంది. 9రోజులు జరుపుకునే ఈ సద్దుల బతుకమ్మ పండుగకు గ్రామాల్లో విద్యుత్ దీపాలు, బతుకమ్మ తెప్పలను సిద్ధం చేశారు.

ముస్తాబాద్: ముస్తాబాద్, పోతుగల్, ఆవునూర్, గూడెం, నామాపూర్ గ్రామాల్లో సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముస్తాబాద్ పెద్ద చెరువు వద్ద లైట్లు, జనరేటర్ సౌకర్యం, రంగురంగుల విద్యుత్ దీపాలు, స్వాగత తోరణాలను ఏర్పాటు చేశామని సర్పంచ్ గాండ్ల సుమతి, ఉప సర్పంచ్ వేముల రవీందర్ తెలిపారు. శివకేశవుల ఆలయం, జెడ్పీ స్కూల్, పంచాయతీ కార్యాలయం, కొత్త బస్టాండ్, యూనియన్ బ్యాంక్ వద్ద ఏర్పాట్లు చేశామన్నారు.

బతుకమ్మ ఘాట్ల వద్ద జాగ్రత్తలు పాటించాలి

ముస్తాబాద్: మండలంలో సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి జాగ్రత్తలు పాటించాలని ఎస్సై శేఖర్ సూచించారు. శనివారం మాట్లాడుతూ.. బతుకమ్మ నిమజ్జనాన్ని చెరువులు, కుంటలు, మానేరు తీరంలో చేపడుతున్నారని, పంచాయతీ అధికారులు, సర్పంచులు తగిన ఏర్పాట్లు చేశారన్నారు. లైట్లు, బారికేడ్లు ఉన్నాయన్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు నీటిలోకి దిగకుండా చూసుకోవాలని అన్నారు. అనుమానితులు కనిపించినా.. ఆపద సమయంలో 100కు ఫోన్ చేయాలని సూచించారు.

పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ రామభీమేశ్వర్ తల్లి రామ యశోద ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. వారి కుటుంబాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు శనివారం పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాష్, బీఆర్‌ఎస్ నాయకులు ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, మొదుసు దేవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వసంత్, మిట్టపల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: వీర్నపల్లి మండలం వన్‌పల్లి సర్పంచ్ జోగినపల్లి లత తల్లి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సోమవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

అణగారిన వర్గాల అధికారమే ధ్యేయం

కోనరావుపేట: తెలంగాణలోని సబ్బండ వర్గాల స్వరాజ్యాన్ని సాధించడం కోసం డాక్టర్ విశారదన్ మహరాజ్ నాయకత్వంలో ఉద్యమిస్తున్నామని ధర్మసమాజ్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం హరీష్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అణగారిన వర్గాల రాజ్యాధికారం లక్ష్యంగా ధర్మసమాజ్ పార్టీ ఎన్నికల యుద్ధంలో పాల్గొంటుందన్నారు. డీఎస్పీ మండల నాయకులు అనిల్, అమర్, మనోజ్, గోవర్ధన్, శంకర్, మహేశ్, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం

వేములవాడరూరల్: చెక్కపల్లి గ్రామానికి చెందిన ఎడపెల్లి అనిల్‌కుమార్ అనే అంతర్జాతీయ క్రీడాకారున్ని గ్రామంలో సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వచ్చే నెల థాయిలాండ్, సింగపూర్, శ్రీలంక దేశాల్లో జరిగే ట్రినేషన్ ఇంటర్నేషనల్ సెప్టోబాల్ టోర్నమెంట్‌కు ఎంపిక కావడంతో సత్కరించారు. పలువురు క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రూరల్ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, తెలంగాణ స్టేట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఓదెలయాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, ఉప సర్పంచ్ మంజుల, యూత్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్, సత్యనారాయణ, సురేందర్, ప్రవీణ పాల్గొన్నారు.

చెక్‌పోస్టులున్నాయి జాగ్రత్త..!



వేములవాడరూరల్: సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది తనిఖీలు ముమ్మరం చేయడంతో వాహనదారులు కంగుతింటున్నారు. జిల్లా, మండల సరిహద్దుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు మూడు శాఖల అధికారులు మూడు షిఫ్టుల్లో ఈ తనిఖీలు చేపడుతున్నారు. దీంతో పండుగలకు వెళ్లేవారు, వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు తనిఖీలతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చే వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వేములవాడకు పంపిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో గోల్‌మాల్ చేయొద్దు

ఎల్లారెడ్డిపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఆగం చేసేలా ఏర్పాట్లు ఉండొద్దని.. సంచికి 40 కిలోల ధాన్యం మాత్రమే తూకం వేయాలని మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం మాట్లాడారు. రైతులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. ఆయన వెంట డీసీసీ కార్యదర్శి రామచంద్రం, బాబు, మల్లారెడ్డి, లింగం, సంతోష్ తదితరులున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

తంగళ్లపల్లి: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ అన్నారు. శనివారం దాచారం గ్రామంలో గ్రామస్తులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏఎస్సై మోతిరామ్, హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుళ్లు తిరుపతి, శ్రీనివాస్, జీవన్ పాల్గొన్నారు.

కేసీఆర్ ముఖం చూసి కేటీఆర్‌కు ఓట్లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తొలిసారి సిరిసిల్ల ఎన్నికల బరిలో నిలిచిన కేటీఆర్‌కు తన తండ్రి కేసీఆర్ ముఖం చూసి ప్రజలు ఓట్లు వేశారని కాంగ్రెస్ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఎద్దేవ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. ఉద్యమ నేపథ్యం లేని కేటీఆర్ కేసీఆర్ దయతో గెలిచాడని అన్నారు. నాయకులు లింగాల భూపతి, గుగ్గిళ్ల శ్రీకాంత్, అరెపల్లి బాలు, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే రాజ్యాధికారం సాధ్యం

వీర్నపల్లి: బీఎస్పీతోనే బహుజనుల రాజ్యాధికారం సాధ్యమని వీర్నపల్లి బీఎస్పీ మండలాధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఎస్పీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. బీఎస్పీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా పాటి శ్రీనివాస్, వీర్నపల్లి మండల పట్టణ అధ్యక్షుడిగా మండేపల్లి రవిని నియమిస్తున్నట్లు తెలిపారు. నాయకులు ఇసంపెల్లి కొమురయ్య, అనిల్, శ్రీను, రవి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.